# అవినీతి శాస్త్రం

**ఆ మధ్య** నేను రైలు ప్రయాణం చేయవలసి వచ్చింది. టిక్కెట్టు తెచ్చి పెట్టమని ఒక సినిమా కంపెనీ ప్రొడక్షన్‌లో పనిచేసే కుర్రవాడికి టిక్కెట్టు చార్జీ, స్టేషన్‌కు రాను పోను బస్ చార్జి కలిపి ఇచ్చాను.

అతను డబ్బు లెక్క చూసుకొని "ఇంకొక పదిహేను రూపాయలు ఇవ్వండి" అన్నాడు.

"ఎందుకు?" అన్నాను.

"అయ్యా! ఇప్పుడు టికెట్ మాత్రమే కొంటే, 'వైటింగ్ లిస్ట్' అంటాడు. ఆ పదిహేను వాడి మొఖాన పారేస్తే, రిజర్వేషన్ టికెట్‌తో సహా ఇప్పుడే ఇచ్చేస్తాడు" అన్నాడు.

నాకు కోపం వచ్చింది! "ఇరవై రోజులు ముందుగా కొన్నా కూడా వైటింగ్ లిస్టేనా?" అన్నాను.

"టికెట్ తెచ్చే వాణ్ణే గానీ, ఇచ్చేవాణ్ణి నేను కాదు గదండీ! ఉన్న సంగతి చెప్పాను. అయినా ఒక సంగతి ఆలోచించండి!

ఈ పదిహేను రూపాయలు వచ్చే నెలా, రెండు నెల్లో రైల్వే వాళ్ళు ఎలాగూ పెంచుతారు! అప్పుడు వచ్చినట్టు ఇచ్చుకుంటారు గదా — ఆ పెంచడం ఇప్పుడే పెంచారనుకోండి—ప్రయాణం హాయిగా సాగుతుంది" అన్నాడు.

నాకు దిమ్మ తిరిగిపోయింది—నిజమే, వాడు చెప్పిందాంట్లో ఎంత సత్యం ఉంది!

ఆమాత్రంజ్ఞానం నాకు లేకపోయిందేఅనిలోలోన సిగ్గుపడి మాట్లాడకుండ పదిహేనుకు బదులు ఇరవై రూపాయలు వాడి చేతిలో పెట్టాను.

నాకు ఇంత సూక్ష్మంగా జ్ఞానబోధ చేసినందుకు విజయ గర్వంతో ఒక మందహాసం పారేసి చక్కా పోయాడు!

• • • •

మా బావమరిది తరుచు మదరాసు వచ్చి పోతుంటాడు!

మాట్లాడుతూ,మాట్లాడుతూ "నేను వెళతాను" అని లేస్తాడు!

"ఎక్కడికి?"

"వూరికి!"

గడియారం చూసుకుని "ఒక గంటలో ఫలానా రైలు ఉందిగా!" అంటాడు.

"రైలు ఉంటేనే! కాని టిక్కెట్టు ఎలా దొరుకుతుందీ?" "ఆఁ ఆ కండక్టరు చేతిలో పది రూపాయలు పారేస్తే సరి!..."

"పది రూపాయలు ఇస్తే టిక్కెట్ రిజర్వేషన్ ఇస్తాడా?" అన్నాను ఆశ్చర్యంగా.

"టిక్కెట్టు ఎందుకూ?" అన్నాడు అదో రకమైన మందహాసం పారేసి!

ఆ మందహాసంలోనూ అదే అర్థం—"ఇంత చదువుకొన్నావు! ఈ మాత్రం తెలీదా!" అని!

నిజమే! చదువు ఒకప్పుడు గర్వకారణం! ఇప్పుడు చదువుకుని చెడిపోయినందుకు సిగ్గుపడ వలసిన రోజులు వచ్చినాయి!

• • • •

మరోసారి ప్రయాణానికి రెండు రోజులు ముందు స్టేషన్‌కి వెళ్ళి టిక్కెట్టు స్వయంగా కొనుక్కున్నాను.

'వెయిటింగ్ లిస్ట్‌లో 58' అని టిక్కెట్టు మీద వ్రాశాడు.

"ఓశ్! ఏం ఫరవాలేదు! ఆ టికెట్ కలెక్టర్ చేతిలో పది రూపాయలు పారేస్తే సరి"లని అనుకొన్నాను, మా బావమరిదిని తలుచుకొని!

ప్రయాణం రోజు రైలు టైమ్‌కు అరగంట ముందే స్టేషన్‌కి వెళ్ళాను.

ప్లాట్‌ఫారం మీద టికెట్ కలెక్టర్ చుట్టూ

---

**స్కూళ్ళలో పిల్లలకు ప్రాథమిక దశనుంచి బోధించడం చాలా అవసరం.**

---

పాతిక, ముప్ఫయిమంది జనం మూగి ఎగబడుతున్నారు. అతను ఏవేవో చెబుతున్నాడు.

నేను కూడా పది రూపాయల నోటు చేత్తో పట్టుకుని, జనాన్ని తోసుకుని అతని ముఖం ముందు నోటు ఆడించాను.

అతను నా ముఖం వంక చూసి కోపంగా— "ఏమయ్యా! నీ కొక్కడికేనా డబ్బున్నది! వీళ్ళెవ్వరికీ లేదనుకున్నావా? ఏయ్! పోలీస్..." అని ఒక పక్కకి

**డి. వి. నరసరాజు**



చూశాడు! మళ్ళీ ఇటు పక్కకి చూసేసరికి నేను అక్కడ లేను!

టిక్కెట్ కేన్సిల్ చేసుకొని, డబ్బు వాపసు తీసుకుని ఇల్లు చేరుకున్నాను!

• • • •

నాలుగైదేళ్ళ క్రితం ఒక సంఘటన. మా వూళ్ళో (పల్లెటూరు) వూరి పక్కనే — నాది రెండెకరాల మెరక పొలం ఉన్నది.

అందులో ఏమీ పండదు కాని, మెరక దిబ్బ గనక, వూరి పక్కనే ఉంది గనక ఇళ్ళ స్థలాలకు పనికివస్తుంది.

షెడ్యూల్డు కులాల వారికి ఇళ్ళు కట్టి ఇవ్వడానికి ప్రభుత్వం వారు అందులో ఒక ఎకరం స్వాధీనం చేసుకున్నారు.

అందుకుగాను ప్రభుత్వం వారు నాకు 'కాంపెన్సేషన్' ఇవ్వాలి.

ఆ డిపార్టుమెంటు ఉద్యోగులు మా వూరు వచ్చి కరణంగారి ద్వారా మా తమ్ముడితో మాట్లాడేరు. (నేను మా వూళ్ళో ఉండను గనక).

ఆ ఎకరం స్థలానికి ఇరవై వేలు ఇవ్వమని ప్రభుత్వానికి రాస్తామని చెప్పారట.

మా తమ్ముడు నాకు రాశాడు. నేను విస్తుపోయాను. అది అమ్మితే ఎకరం రెండు వేలకికూడా ఎవ్వరూ కొనరు.

సరే, ఒక ఏడాది గడిచాక "వచ్చి పైకం తీసుకెళ్ళ"మని ప్రభుత్వం వారు నోటీసు ఇచ్చారు.

వెళ్ళాను.

మా తమ్ముణ్ణీ, కరణం గారిని అడిగాను— 'ఈ ఇరవై వేలలో ఉద్యోగులకి ఎంత ఇవ్వాలి' అని.

"అబ్బే! మనం ఏమీ ఇవ్వ నక్కరలేదు. ఇరవై అందు వేలకి రసీదు ఇవ్వాలి. అంతే.ఆ పై అయిదు వేలు వాళ్ళు తీసుకుంటారు" అన్నారు కరణంగారు.

ఆహా! ఎంత బాగుంది పద్ధతి! ఎవరికీ నొప్పి లేకుండా — వాళ్ళకీ, మనకీ, ఇద్దరికీ లాభం!

వాళ్ళ తెలివికి ఎంతో ముగ్ధుడ నయ్యాను.

ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాం. పెట్టమన్న చోటల్లా సంతకాలు పెట్టాను.

పాపం! నాకు శ్రమ లేకుండా ట్రెజరీ నుంచి రొఖ్ఖం తెప్పించి ఆఫీసరుగారు నోట్ల కట్టలు నా చేతిలో పెట్టి— "పాతిక వేలు" అన్నాడు.

"అదేమిటి?. మీ అయిదు వేలు తీసుకోండి" అని తిరిగి ఇవ్వబోయాను.

ఆఫీసరు అదోలా ఒక చిరునవ్వు పారేసి, నాలుక కరుచుకొని తల వూపాడు—'తప్పు, తప్పు'అన్నట్టు. ఆ ముఖంలోని భావం వర్ణించడానికి నా తరం కాదు గదా ...

అందులో నాకు రెండు అర్థాలు స్ఫురించినాయి. ఒకటి — 'ఈ మాత్రం కామన్‌సెన్స్ లేని వాడివి సినిమాలకి కథలు ఎలా వ్రాస్తున్నావు' అని.

రెండు: 'నీలాంటి వాళ్ళు వ్రాయబట్టే ఈనాటి సినిమాలు ఇలా ఏడుస్తున్నాయి' అని.

మా కరణంగారు కోపంగా నా వంక చూసి

"ఇలా రండి" అని లేచి బయటికి వెళ్ళాడు. నేనూ, మా తమ్ముడూ కూడ వెళ్ళాం!

"అబ్బ! అలా ఆఫీసులో అందరి ముందు ఇస్తే తీసుకుంటారండి?" కరణంగారు విసుక్కున్నారు.

"ఏం? వాళ్ళందరికీ తెలిసిందేగా..."

"తెలిస్తే మటుకు"— నా చేతిలో నోట్లకట్ట తీసుకొని, అయిదు వేలు లెక్క పెట్టి విడిగా తీశాడు! ఒక ప్రక్కకి చూశాడు.

ఒక గుమాస్తా దూరంగా నిలబడి ఉన్నాడు. కరణంగారు రమ్మని సైగ జేశారు. గుమాస్తా వచ్చాడు. కరణంగారు ఇచ్చారు. అతను తీసుకొని నా వంక చూసి మందహాసంతో నమస్కరించి వెళ్ళిపోయాడు.

నిజమే!

ఒకప్పుడు నేను ఒక గవర్నమెంటు ఉద్యోగానికి అప్లయి చేస్తే—"అనర్హుడవు" అని తిరగ్గొట్టారు.

అప్పుడు కోపం వచ్చింది గాని, ఈ సంఘటనతో 'అనర్హుణ్ణ'ని ఒప్పుకోక తప్పలేదు.

ప్రభుత్వ ఉద్యోగం చెయ్యాలంటే చాలా తెలివి ఉండాలి!

•  •  •  •

రెండేళ్ళకుపైగా అయింది, టౌన్‌లో నేను ఒక ఇల్లు కట్టి.

దానికి కార్పొరేషన్ వాళ్ళు ఇంటి పన్ను నిర్ణయించాలి.

వాళ్ళు ఎప్పుడు వస్తారో, ఎంత పన్ను వేస్తారో!

మా ఇంటి పక్కాయనను అడిగాను. ఆయన నా కంటే రెండేళ్ళు ముందే ఇల్లు కట్టాడు.

అనుభవజ్ఞుడు.

"ఆఁదానిదేముంది? మామూలే! వాళ్ళ చేతుల్లో ఏమైనా పెడితే సరి, తక్కువ వేస్తారు" అన్నాడు తేలిగ్గా!

"వాళ్ళ చేతుల్లో ఎంత పెట్టాలి? ఏం పెట్టాలి? ఎలా పెట్టాలి??"

నాకు రైలు ప్రయాణం గుర్తుకు వచ్చింది.

మా పక్కఇంటాయన్నే ప్రతిమాలాను, సహాయం చేయమని.

'ఆఁ! దాందేముంది! వాళ్ళు వచ్చినప్పుడు నన్ను పిలవండి, నేను మాట్లాడతాను" అన్నాడు.

ఇంటిపన్నే గాదు, ఎలెక్ట్రిసిటీ వాళ్ళ గూడా ఇంతే!

రెండేళ్ళకు పైగా అయింది గృహప్రవేశం చేసి. ఈ రెండేళ్ళ నుంచీ ఎలెక్ట్రిసిటీ మీటరు చూసిన వాడు లేడు. బిల్లు పంపినవాడూ లేడు!

ప్రక్కఇంటాయన్ని అడిగాను. "ఒకేసారి ఏ రెండువేలో, మూడు వేలో బిల్లు చెల్లించమంటే ఎట్లా?"

మళ్ళీ ఆయన అనేశాడు తేలిగ్గా! "ఆఁ! దానిదేముందండి! వాడి చేతిలో ఏమైనా పెడితే మీటరు వెనక్కి తిప్పి తక్కువ రాసేస్తాడు."

మళ్ళీ అదే గొడవ. "వాడి చేతిలో ఏం పెట్టాలి! ఎలా పెట్టాలి?"

"వాళ్ళు వచ్చినప్పుడు నన్ను పిలవండి— నేను మాట్లాడుతాను."

ఇలా ప్రతి చిన్న విషయానికీ ఒకరి మీద ఆధారపడవలసిందే గాని, స్వయంగా చేసుకునే యోగ్యత లేకుండా పోయింది.

•  •  •  •

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే — నిత్యజీవితంలో నా లాంటి అసమర్థులు పడే పాట్లు వివరించడానికి.

అందువల్ల నేను మనవి చేసే దేమిటంటే— "లంచగొండితనాన్ని నిర్మూలించాలి. అవినీతిని పారద్రోలాలి" అని వివాదాలు చేసి ప్రయోజనం లేదు.

యథార్థ పరిస్థితులు గ్రహించి ప్రాక్టికల్ మార్గాలు ఆలోచించాలి!

'అవినీతి', అవినీతి' అని నాలుకలు పీక్కుంటే కాదు.

ఒకప్పుడు 'అవినీతి' అనుకున్నది ఇప్పుడు 'నీతి'గా నిలబడిపోయింది.

ఎందుకూ పనికిరాని పాత నీతిశాస్త్రాలకు బదులు నాబోటి వాళ్ళకి నిత్య జీవితంలో పనికి వచ్చే 'అవినీతి శాస్త్రాలు' చిన్నపిల్లలకి స్కూళ్ళలో ప్రాథమిక దశ నుంచే బోధించడం చాలా అవసరం.

'లంచం' నిత్య జీవిత సత్యం అయి కూర్చుంది గనక, 'లంచం ఎలా ఇవ్వాలి? ఎలా పుచ్చుకోవాలి?' ఇత్యాది 'అవినీతి శాస్త్రాలు' పిల్లలకి చిన్నప్పటినుంచే బోధిస్తే — ముందు, ముందు జీవితంలో నానాగా ఇబ్బందులు పడకుండా ప్రయోజకు లవుతారు.

★

# ప్రశ్నోత్తరీయం

**బాట** ప్రక్కను చెట్లు నాటినా రెందుకని?
బాట మధ్య నాటితే బండ్ల కడ్డం వస్తాయని
ముక్కుకు అటు నిటు చెవులు మొలిచా యెందుకు ?
చక్కగా కంటి అద్దాలు తగిలించుకొనేందుకు
జానెడంత లేవు సెక్సు పుస్తకాలెందుకు ?
నేనుకాదు నా తమ్ముడు చదివేటందుకు
చలికాలంలో దినాలు చాల కురుచ ఎందుకు ?
వేసవిలో పగటికి ఇంత నిడివి ఎందుకు ?
చలికి సంకోచించును, వేడికి వ్యాకోచించును
ఈమాత్రం భవుతికశాస్త్రం ఎరుకలేదా నీకు?
ప్రతిరోజు మొక్కను పీకి చూస్తావెందుకు ?
వేళ్ళు పెట్టిందో లేదో వివరంగా తెలుసుకొనేందుకు
మన ప్రేమ స్థిరంగా ఉండాలంటే మార్గమేమిటి ప్రియా?
పెళ్ళి మాని ఇలాగా ఎల్లకాలముండాలి చెలియా!
పెండ్లిలో అమ్మాయి కొంగు అబ్బాయికి ముడివేశా రెందుకు?
పీటలమీద నుంచి పెండ్లికొడుకు పారిపోకుండేందుకు
ఎవరయ్యా ఆ లారీ క్రింద పడ్డ వ్యక్తి?
"రోడ్డు ప్రమాదాలు — జాగ్రత్తలు" గ్రంథ రచయిత
తోడి విద్యార్థి కలం దొంగిలిస్తావా భడవా?
నీ దనుకొని అలా చేశాను గురువా!
కాఫీ చేయడం, త్రాగడం చేయగలవా ఒకేసారి?
కాఫీ పొడి నోట ఉంచి పాలు త్రాగితే సరి
ఇన్నేండ్లు జీతం పెంచమని అడిగినావా?
అందుకే ఉద్యోగంలో ఇన్నేండ్లు ఉన్నావు నాయనా!
పాట పాడుతూ ఆమె కండ్లు మూసుకొన్న దెందుకని ?
పాట వినేవారి బాధ చూడడ మెందుకని.

**- డా॥ ఉండేల మాలకొండారెడ్డి**